గ్రాసం కరువు .. పోషణ బరువు !

పశుగ్రాసం కొరతతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఈసారి పంటలు సరిగా పండకపోగా.. కొండగుట్టల్లోనూ తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతుండటంతో గ్రాసం కొరత పట్టిపీడిస్తోంది. దీనికి తోడు పశుగ్రాసం ధర కొండెక్కి కూర్చోవడంతో అంత ధర పెట్టి కొనలేక చాలా మంది పాడి రైతులు జీవాలను అమ్ముకుంటున్నారు.



అగళి ప్రాంతంలో మేత కోసం వెంపర్లాడుతున్న గొర్రెలు

నియోజకవర్గంలో పశు సంపద ఇలా...

గొర్రెలు, మేకలు : 5 లక్షలకు పైగానే..
ఆవులు, ఎద్దులు, గేదెలు : 50 వేలపైనే..
ఆధారపడిన కుటుంబాల సంఖ్య : 9,800

గడ్డి కొరతతో రైతుల అవస్థలు

- ట్రాక్టర్ పశుగ్రాసం రూ.25 వేలు పైమాటే
- సబ్సిడీపై దాణా పంపిణీ చేయాలంటున్న పాడి రైతులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

అగళి: మడకశిర నియోజకవర్గంలో గ్రాసం కొరత తీవ్రమైంది. దీంతో పశుపోషకులు, జీవాల పెంపకదారులు వాటి పోషణకు అష్టకష్టాలు పడుతున్నారు. వ్యవసాయం కంటే అధికంగా రైతులు, కూలీలు సన్న జీవాలు (గొర్రెలు, మేకలు), పాడి పశువుల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అధిక ధరలకు గ్రాసం కొనలేక పలువురు పాడి రైతులు జీవాలను అమ్మేసుకుంటుండగా చాలా మంది అతికష్టంమీద పశుపోషణ సాగిస్తున్నారు. మడకశిర నియోజకవర్గంలో సన్న జీవాలు (గొర్రెలు, మేకలు) ఐదు లక్షల వరకూ ఉన్నాయి. దాదాపు 9,980 కుటుంబాలు వాటి ఆధారంగానే జీవనం సాగిస్తున్నాయి. ఆవులు, ఎద్దులు, గేదెలు 50 వేలు పైబడి ఉన్నాయి.

ప్రతి యేటా ఇదే దుస్థితి

వేసవి రాగానే పొలం గట్లు, సమీప కొండగుట్టలు అగ్నికి ఆహుతి కావడం సర్వసాధారణమైపోయింది. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి నెలకొంది. ఎండు గడ్డిని కాల్చివేసే ఉద్దేశంతో పొలం గట్లకు నిప్పుపెట్టేవారు కొందరైతే.. మరికొందరు పశువుల కాపరులు బీడీ కాల్చి ఆర్పకుండా పడేస్తుండటంతో మంటలు వ్యాపించి పొలంగట్లు, గుట్టల్లో గ్రాసం పూర్తిగా కాలిపోయి పశువులకు మేత దొరకని పరిస్థితి నెలకొంది. ఇటీవలి కాలంలో మడకశిర, అగళి, రొళ్ల మండలాల్లో పలుచోట్ల అగ్ని ప్రమాదాల్లో మామిడి, చింత చెట్లు, నిమ్మకాయ చెట్లు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు.

గ్రాసం ధరకు రెక్కలు

ప్రస్తుతం ఒక ట్రాక్టర్ వేరుశనగ కట్టె (పశుగ్రాసం) రూ.25 వేలపైగా ధర పలుకుతున్నట్లు పశువుల యజమానులు చెబుతున్నారు. అదికూడా సుదూర ప్రాంతాల్లో ఎక్కడ లభ్యమైతే అక్కడికి వెళ్లి కొనుగోలు చేసి తీసుకురావాల్సి వస్తోందని వాపోతున్నారు. దీంతో అదనంగా రవాణా ఖర్చులతో పాటు వ్యయ ప్రయాసలకు గురికావాల్సి వస్తోంది. గ్రాసం కొరత తీవ్రస్థాయిలో నెలకొని పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నా పశుపోషకులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోడం బాధాకరమని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సబ్సిడీపై గ్రాసం పంపిణీ చేస్తే తమకు ఎంతో ఊరటగా ఉంటుందని చెబుతున్నారు.

తాగునీటికీ కటకట

ఇప్పటికే చెరువులు, కుంటల్లో నీరు పూర్తిగా ఇంకిపోయింది. అక్కడక్కడా రైతులకు చెందిన బోరుబావుల వద్ద వారి అనుమతితో చిన్నపాటి కుంటలు ఏర్పాటు చేసుకొని అందులోకి నీరు వదులుకొని గొర్రెలు, మేకలు, పశువుల దాహం తీరుస్తున్నారు. మేత కోసం అడవిలో ఎంత దూరం వెళ్లినా నీటి కోసం గ్రామ సమీపంలోని కుంటల వద్దకు జీవాలను తోలుకొని రావడం, నీరు తాగిన తరువాత తిరిగి మేతకు తోలుకెళ్లడం చేస్తున్నామని కాపరులు వాపోతున్నారు.

గ్రాసం లేక ఇబ్బందులు



బీడు పొలం అంతా తిరిగినా గొర్రెలు నిలబడి మేసేందుకు ఎక్కడా గడ్డిపోచ కూడా లేదు. పశు గ్రాసానికి ఎన్నో ఇబ్బందులు పడుతున్నా. పొద్దన్నే కొద్దిసేపు జీవాలను అట్లా తిప్పుకొనిరావడం, ఎండపడగానే చెట్ల కింద నీడన తోలుకోవడం చేస్తున్నా. మేత లేకపోవడంతో గొర్రెలు కాయడం చానా కష్టమైపోయింది.

– మోహన ,ఆలూడి గ్రామం,అగళి మండలం

రాయితీపై దాణా ఇవ్వాలి



పశుగ్రాసం కొందమంటే ఒక ట్రాక్టర్ వేరుశనగ కట్టె రూ..25 వేలు పైగా ధర చెబుతున్నారు. గ్రాసం కొని జీవాలు మేపే పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం స్పందించి పశుపోషకులకు రాయితీపై దాణా పంపిణీ చేయాలి.

– రవిచంద్ర, కారిదాసన్నపల్లి,అగళి మండలం

సబ్సిడీ ప్రతిపాదన లేదు

సబ్సిడీపై దాణా పంపిణీ చేసే విషయంపై ప్రభుత్వం నుంచి ఇంతవరకూ మాకు ఎలాంటి సమాచారం లేదు. ప్రస్తుతం పశు బీమా కార్యక్రమం జరుగుతోంది. సబ్సిడీపై పశుగ్రాసం పంపిణీ పై ప్రభుత్వం నుంచి మాకు ఏదైనా సమాచారం అందితే వెంటనే పశువుల యజమానులకు తెలియపరుస్తాం.

– డాక్టర్ అమర్, ఏడీ , మడకశిర

క్లుప్తంగా

చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు



మాట్లాడుతున్న ఎస్పీ అశోక్ వెంకట్

పావగడ: ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ చట్టాన్ని చేతుల్లో తీసుకొని నేరస్తులు కావొద్దని తుమకూరు జిల్లా ఎస్పీ అశోక్ వెంకట్ క్యాతగానకెరె గ్రామస్తులను హెచ్చరించారు. తాలూకాలోని క్యాతగానకెరెలో ఓ ప్రార్థన మందిరం వివాదంపై బుధవారం ఆయన శాంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ మాట్లాడుతూ ఇతర మతస్తులు తమ మతంలోకి బలవంత మార్పిడికి పాల్పడితే 112 నంబరుకు ఫోన్ చేస్తే పోలీసులు వెంటనే స్పందిస్తారని పేర్కొన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు డీఎస్పీ మంజునాథ్, సీఐ గిరీశ్, తిరుమణి ఎస్ఐ లక్ష్మణ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణంపై మంత్రి ఆరా

సాక్షి ఎఫెక్ట్..

రొద్దం: మండల పరిధిలోని చోళేమర్రి పంచాయతీ గొబ్బరంపల్లి గ్రామంలో సిమెంట్ రోడ్డు నిర్మాణంపై 'మేమేం పాపం చేశాం?' అన్న శీర్షికన బుధవారం సాక్షిలో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. రాష్ట్ర బీసీ సంక్షేమ, జౌళిశాఖ మంత్రి సవిత ఆ కథనంపై స్పందించినట్లు తెలిసింది. రోడ్డు నిర్మాణం పనులను కాంట్రాక్టర్‌తో కలసి తనిఖీ చేయాలని పీఆర్ డీఈ వెంకటనారాయణను ఆదేశించినట్లు సమాచారం. అదేవిధంగా కాంట్రాక్టర్ పోలు వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం చేసినా ఒక్కరూపాయి బిల్లు ఇంకా పడలేదని, తాము డబ్బు డ్రా చేయలేదన్నారు. రోడ్డు నిర్మాణంలో ఎక్కడా అవకతవకలు జరగలేదని వివరించారు. రూ. లక్షకు 25.5 మీటర్ల చొప్పున దాదాపు 153 మీటర్ల రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. మరో రూ 6 లక్షలు మంజూరు చేయించి మిగిలిన రోడ్డు వేస్తామన్నారు.

యువకుడి అదృశ్యం

పెనుకొండ: పట్టణంలోని దర్గాపేటకు చెందిన ఫక్రోద్దీన్ (25) గత నెల 30న అదృశ్యమైనట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. గత నెల 30న సాయంత్రం 5 గంటల ప్రాంతంలో పని ఉందని ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఫక్రోద్దీన్ తిరిగిరాలేదని చెప్పారు. పలు ప్రాంతాల్లో కటుంబ సభ్యులు గాలించినా అతని ఆచూకీ లభించలేదని వెల్లడించారు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



ప్రమాదానికి గురైన కారు

మడకశిరరూరల్: మండల పరిధిలోని కల్లుమర్రి సమీపంలోని హైవేలో ఓ కారు ప్రమాదానికి గురైంది. స్థానికుల వివరాలమేరకు.. మడకశిర వ్యవసాయ మార్కెట్ యార్డులోని అగ్రి టెస్టు ల్యాబ్‌లో ఎలిజిబెత్‌రాణి ఏఓగా పనిచేస్తున్నారు. విధులు ముగించుకుని కారులో బుధవారం హిందూపురం బయలుదేరారు. అయితే కల్లుమర్రి సమీపంలోని హైవేలో కారు పంక్చర్ కావడంతో విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్ని పొలంలోకి దుసుకెళ్లింది. అయితే ప్రమాదంలో ఏఓ స్వల్పగాయాలతో బయట పడ్డారు. వెంటనే ఆమెను హిందూపురం ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో కారు కూడా దెబ్బతింది.

నిందితుల నుంచి నగదు రికవరీ

పరిగి: మండలంలోని శాసనకోట గ్రామ పంచాయతీ పరిధిలోని బాలిరెడ్డిపల్లిలో లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో మంగళవారం చోరీ జరిగింది. హుండీని పగలగొట్టి రూ.13 వేల నగదును దుండగులు దొంగిలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించిన అనంతరం సీసీ కెమెరాల ఆధారంగా ముగ్గురు అనుమానితులు చోరీకి పాల్పడినట్లు గురించి విచారించారు. దొంగతనానికి పాల్పడింది వారేనని తేల్చారు. వెంటనే వారి వద్ద రూ.13 వేల నగదును రికవరీ చేసినట్లు ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు.

పాలీసెట్‌లో ఉచిత శిక్షణ

మడకశిర: పాలీసెట్ రాసే విద్యార్థులకు మండలంలోని కే గుండుమల పాలిటెక్నిక్ కళాశాలలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ రాధాక్రిష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7 నుంచి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఈ నెల 28 వరకూ శిక్షణ ఇస్తామన్నారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్ కూడా ఉచితంగా అందిస్తామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 8247529542, 9492660993 సెల్ నంబర్లకు ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

30న 'సంఘం శరణం గచ్ఛామి' నాటక ప్రదర్శన

హిందూపురం టౌన్: పట్టణంలోని బీపీఎల్ కాంప్లెక్స్ వద్ద ఈ నెల 30న రాత్రి 8 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రను సంఘం శరణం గచ్ఛామి అనే నాటిక ద్వారా ప్రదర్శిస్తున్నట్లు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ కళా బృందంచే అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటకం ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి రమణ, జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు రాయుడు, మారుతి, సరస్వతి, అనితమ్మ, గంగమ్మ, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

సంక్షిప్త సమాచారం

నోటి శుభ్రత పాటించాలి

రొళ్ల: గ్రామీణులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని సీహెచ్‌సీ డాక్టర్ బాలప్రణీత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక సీహెచ్‌సీ ఆవరణలో ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ చేపట్టారు. డాక్టర్ బాలప్రణీత్‌రెడ్డి మాట్లాడుతూ నోటి శుభ్రత లేకపోతే ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన

మడకశిర: మడకశిర డిపోలో ఎన్ఎంయూ బుధవారం ఆర్టీసీ కార్మికులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్ఎంయూ డిపో అధ్యక్షుడు రామక్రిష్ణ , కార్మికులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో మంచి పేరు తెచ్చుకోవాలి



మురళీధర్‌రావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

మడకశిర: విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ మంచి పేరు తెచ్చుకోవాలని వక్తలు తెలిపారు. మండలంలోని గుండుమల జ్యోతిరావు పూలే బీసీ బాలుర గురుకుల కళాశాల ప్రిన్సిపల్ మురళీధర్‌రావు మార్చి 31న పదవీ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం పట్టణంలోని యాదవ కల్యాణ మండపంలో పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'సదరం'కు దరఖాస్తు చేసుకోండి

అమరాపురం: మండలంలోని దివ్యాంగులు సదరం ధ్రువ పత్రాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ రామరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4వ తేదీ ఉదయం పది గంటలకు ఆయా గ్రామ సచివాలయాలకు వెళ్లి ఆధార్ కార్డు, సెల్‌ఫోన్‌తో సదరం సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చైర్లు, టేబుళ్ల వితరణ

రొళ్ల: మండల పరిధిలోని కొత్తపాళ్యం వెంకటేశ్వర స్వామి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు గోవిందరాజు చైర్లు, టేబుళ్లు వితరణ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం చేరుకుని కార్యాలయానికి 40 ఫైబర్ చైర్లు, రెండు ఎస్ చైర్లతో పాటు ఆరు టేబుళ్లను అందజేశారు. గోవిందరాజును తహసీల్దార్ షేక్షావలి, సిబ్బంది అభినందించారు.

చౌకధాన్యపు డిపో తనిఖీ

లేపాక్షి: లేపాక్షి పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో నిర్వహిస్తున్న చౌకధాన్యపు డిపోను బుధవారం ఉదయం తహసీల్దార్ సౌజన్యలక్ష్మి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎఫ్‌పీ షాపు నుంచి నిత్యావసర సరకులు అందిస్తున్నారా? లేదా, ఎండీయూ ఆపరేటర్ సకాలంలో వచ్చి సరుకులు పంపిణీ చేస్తున్నారా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మహనీయుల జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం

పావగడ: మహనీయుడు, మాజీ ఉప ప్రధాని డా బాబు జగ్జీవన్‌రాం 118వ జయంతి , భారత రాజ్యాంగ నిర్మాత డా బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని స్థానిక దళిత నాయకులు తహసీల్దార్ వరదరాజును కోరారు. స్థానిక తాలూకా కార్యాలయం మీటింగ్ హాల్‌లో బుధవారం నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకల ముందస్తు సభలో దళిత నాయకుడు డీజేఎస్ నారాయణప్ప మాట్లాడుతూ ఈ నెల 14 న జరిగే మహనీయుల జయంతి వేడుకలను తుమకూరు రోడ్డు లోని నూతన అంబేడ్కర్ భవనంలో నిర్వహిస్తే సమంజసంగా ఉంటుందన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

లేపాక్షి: విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుపైన శ్రద్ధ చూపితే ఉన్నత స్థానానికి చేరుకుంటారని ఉప విద్యాశాఖ అధికారి పద్మప్రియ తెలిపారు. బుధవారం మండలంలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల వార్షికోత్సవంతో పాటు క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ అశ్వత్థ నారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రభాకర్, పాఠశాల కమిటీ చైర్మన్ నరసింహమూర్తి, హెచ్ఎం సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీవనోపాధుల ప్రణాళిక తయారీపై శిక్షణ

అమరాపురం: స్థానిక ఐకేపీ కార్యాలయంలో బుధవారం వార్షిక , జీవనోపాధుల ప్రణాళికలపై ఏపీఎం ముత్యాలప్ప ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘం సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఓఏలు, మహిళా సంఘాల లీడర్లకు నాలుగు రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. సీసీ నాగరాజు మాట్లాడుతూ వార్షిక ప్రణాళికను ఏవిధంగా తయారు చేసుకోవాలి, జీవనోపాదులను మెరుగు పరచడం ఎలా చేయాలి అనే అంశాలపై వివరించారు. ప్రతి గ్రామంలో ఐదు నుంచి ఆరు మంది సభ్యులను ఎంపిక చేసుకొని వారికి సర్వే యాప్ ఏవిధంగా చేయాలి, తదితర వాటిని గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఎఫ్‌పీఓ లక్ష్మీనరసప్ప, సీసీలు వీఓఏలు, పాల్గొన్నారు.

లేపాక్షి: మండల కేంద్రమైన వెలుగు కార్యాలయంలో బుధవారం సాయంత్రం డ్వాక్రా సంఘాల సభ్యులకు వార్షిక రుణ, జీవనోపాధుల ప్రణాళికపై ఏరియా కోఆర్డినేటర్ రామిరెడ్డి, ఏపీఎం జయచంద్ర అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీసీలు హరికృష్ణారెడ్డి లక్ష్మీపతి, రత్నమ్మ, పార్వతమ్మ, క్రిష్ణమూర్తి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



లేపాక్షి: సమావేశంలో పాల్గొన్న డ్వాక్రా సంఘం సభ్యులు, అధికారులు

సారాను సమూలంగా నిర్మూలిద్దాం

గుడిబండ: నాటుసారాను సమూలంగా నిర్మూలించి భవిష్యత్తు తరాలకు బంగారు బాట వేద్దామని ఎంపీడీఓ గంగాదర్ అన్నారు. బుధవారం స్థానిక మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నవోదయం–2 కార్యక్రమం నిర్వహించి నాటు సారా నిర్మూలనపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ గంగాధర్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా నాటు సారా తయారు చేసేవారు, తయారీకి సహరించిన వారిపై పీడీయాక్టు అమలు చేయాలని అధికారులకు సూచించారు. నాటు సారా వల్ల ఎన్నో కుటుంబాలు నాశనమవుతున్నాయని, భవిష్యత్తు తరాలు నష్టపోకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ కల్యాణ్ చక్రవర్తి, ఏఎస్ఐ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ గంగాధర్

అడవులను కాపాడాలని ప్రధానికి లేఖ

పెనుకొండ: ఇటీవల కాలంలో కొండగుట్టలకు నిప్పు పెట్టి పచ్చదనానికి చేటు తెస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు చేపట్టాలని పెనుకొండ సాహితీ గగన్ మహల్ ట్రస్ట్ అధ్యక్షులు జే. ప్రతాపరెడ్డి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులకు ఇతర ప్రముఖులకు లేఖలు రాశారు. వేసవి కాలం వస్తే చాలు కొందరు ఆకతాయిలు ఇష్టారాజ్యంగా అడవులు కాల్చి వేస్తున్నారన్నారు. దీనివల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అడవుల పరిరక్షణకు డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా ఉంచడం, గార్డ్స్‌ను నియమించడం, అటవీ ప్రాంతంలో టవర్స్ ఏర్పాటు చేయడం చేపట్టాలన్నారు. అడవులకు నిప్పు పెడుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు చేపట్టాలన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా అటవీ సంపద అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలన్నారు.

బీఎస్ఎన్ఎల్ సేవలకు అంతరాయం

- నెట్‌వర్క్ పనిచేయక వినియోగదారుల ఇబ్బందులు

లేపాక్షి: మండల వ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ పనిచేయకపోవడంతో బీఎస్ఎస్ఎల్ వినియోగదారులు బుధవారం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి నెట్‌వర్క్ పనిచేయకపోవడంతో ఫోన్లు పనిచేయలేక పోయాయి. బీఎస్ఎన్ఎల్ నిర్వాహకులు వినియోగదారులకు అతి తక్కువ ధరలకే సేవలు అందిస్తుండటంతో చాలా మంది వినియోగదారులు బీఎస్ఎన్ఎల్‌పై మక్కువ చూపారు. ఇతర కంపెనీల మొబైల్ వాడుతున్న వినియోగదారులు కూడా బీఎస్ఎన్ఎల్‌కు మార్చుకున్నారు. అయితే బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ పనిచేయకపోవడంతో వినియోగదారులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై బీఎస్ఎన్ఎల్ అధికారులను 'సాక్షి' వివరణ కోరగా.. కేబుల్ పనిచేయలేకపోవడంతో నెట్‌వర్క్ పనిచేయడం లేదని సమాధానం ఇచ్చారు.

వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిరసన

హిందూపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా బుధవారం ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో ముస్లింలు పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఎస్‌డీపీఐ హిందూపురం అసెంబ్లీ అధ్యక్షుడు ఇమ్రాన్, కార్యదర్శి అంజాద్ అలీలు మాట్లాడుతూ ముస్లిం సమాజానికి వ్యతిరేకంగా వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో ఆమోదం కోసం చట్టం చేస్తున్న ప్రభుత్వ వ్యతిరేక విధానాన్ని నిరసిస్తున్నామన్నారు. ముస్లిం సమాజ అభివృద్ధిని జీర్ణించుకోలేక ఆటంకం కలిగించేందుకు కేంద్ర ప్రభుత్వం దుర్మార్గమైన వక్ఫ్ సవరణ చట్టం అమలు చేయటానికి ప్రయత్నిస్తోందన్నారు.



ఉష్ణోగ్రత సమాచారం

హిందుపురం	35.0
పెనుకొండ	37.0
మడకశిర	35.0

సైన్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసిన దృశ్యం

హిందూపురం టౌన్: జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన యురేకా ఆన్‌లైన్ సైన్స్ ప్రయోగాలు జిల్లా స్థాయి పోటీల్లో పట్టణంలోని చిన్మయ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పర్యావరణం, సుస్థిర అభివృద్ధి అనే అంశంలో 8వ తరగతి విద్యార్థిని పూర్ణిక రాయల్ జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. మూఢనమ్మకాలు శాస్త్రీయ దృక్పథం అనే అంశంలో 9వ తరగతి విద్యార్థిని అచ్యుత రెండవ స్థానాన్ని కైవసం చేసుకోగా, సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో 9వ తరగతి విద్యార్థిని సుహానా పాల్గొని ప్రశంసా పత్రాన్ని అందుకుంది. వారికి బుధవారం పాఠశాల యాజమాన్యం, జనవిజ్ఞాన వేదిక సభ్యులు అభినందించి, ప్రశంసాపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ భీమరాజు, ప్రిన్సిపల్ సరళ, వైస్ ప్రిన్సిపల్ మహేష్ బాబు, సైన్స్ కోఆర్డినేటర్ మారుతీ తదితరులు పాల్గొన్నారు.

సిల్క్ కాలనీలో 'కార్డెన్ సెర్చ్'

హిందూపురం అర్బన్: పట్టణంలోని సిల్క్ కాలనీలో బుధవారం రెండో పట్టణ ఎస్ఐ బ్రహ్మానందరెడ్డి , రూరల్ పోలీసులు సంయుక్తంగా అనుమానిత ఇళ్లలో తనిఖీలు చేశారు. రికార్డులు సరిగా లేని నాలుగు ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలను సీజ్ చేశారు. కాలనీలో ప్రజలతో సమావేశమై సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు



దాడుల్లో పాల్గొన్న కమిషనర్, సిబ్బంది

పెనుకొండ: ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని నగర పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్ వ్యాపారులను హెచ్చరించారు. పట్టణంలో బుధవారం కమిషనర్‌తో పాటు సిబ్బంది పెద్ద ఎత్తున ప్లాస్టిక్ కవర్లు , ఇతర ప్లాస్టిక్ వస్తువులు వినియోగిస్తున్న దుకాణాలను తనిఖీ చేసారు. పలు షాపుల్లో వినియోగిస్తున్న ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ప్లాస్టిక్ వస్తువులను వినియోగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరులో ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై గాయాలపాలైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. గ్రామంలోని ఓ ఇంటి ముందు పందిరి వేసే క్రమంలో రఫీక్ అహ్మద్ విద్యుదాఘానికి గురయ్యాడు. గాయపడిన అతన్ని వెంటనే స్థానికులు , కుటుంబ సభ్యులు పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

గంజాయిని అరికట్టాలి

సోమందేపల్లి: మండల కేంద్రంతో పాటు మండల వ్యాప్తంగా గంజాయి అక్రమ రవాణా జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు ఎస్ఐ రమేష్ బాబును కోరారు. ఈ విషయంపై బుధవారం పోలీసుస్టేషన్‌లో ఎస్ఐను కలిసి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో కొందరు యువకులు డ్రగ్స్, బెట్టింగ్‌కు అలవాటుపడి నేరాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పెద్దన్న, హనుమయ్య, కిష్టప్ప, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ లైన్‌మెన్ మృతి

సోమందేపల్లి: మండలం కేంద్రమైన సోమందేపల్లిలో గత నెల 19న విద్యుత్ స్తంభంపై నుంచి జారీ పడి లైన్‌మెన్ రామచంద్రారెడ్డి (48) తీవ్రంగా గాయపడిన విషయం విధితమే. ఇందులో భాగంగానే 14 రోజులుగా బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే పరిస్థితి విషమించడంతో బుధవారం రామచంద్రారెడ్డి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ట్రాన్స్‌కో ఉద్యోగులు ఆయన మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.